సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 15 । మార్చి । 2025



సోమశిలలో 55.697 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 55.697 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.91,.110
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,230
3 శాతం జీఎస్టీతో	రూ.8,477
నవర (8 గ్రా)	రూ.67,816

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.1 /24.7

శనివారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 64 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శనివారం	ఆదివారం
సా: 6.21	ఉ: 4.58



నెల్లూరు నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్





మూలాపేటలోని చేపల మార్కెట్

తూకం.. మోసం

- వినియోగదారుల జేబులకు చిల్లు
- అడుగడుగునా అవకతవకలు
- నాణ్యతలేని సరుకుల విక్రయాలు
- కూరగాయలు, చేపల మార్కెట్లలో ఇదీ పరిస్థితి
- అందుబాటులో లేని ధర్మకాటా

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

నెల్లూరు (పొగతోట)/ నెల్లూరు అర్బన్/ నెల్లూరు (క్రైమ్)/ నెల్లూరు సిటీ: వస్తు కొనుగోలు సమయంలో వినియోగదారుల జేబులకు నిత్యం చిల్లు పడుతోంది. వ్యాపారుల స్వార్థం, అధికారుల పర్యవేక్షణ లేమి కారణంగా వినియోగదారులు అడుగడుగునా మోసపోతున్నారు. కూరగాయల మార్కెట్, పెట్రోలు బంకులు, నిత్యావసర సరుకుల దుకాణాలు, రోడ్లపై పండ్ల షాపులు ఇలా ప్రతిచోట వినియోగదారులు నష్టపోతున్నారు. తూకాలు, కొలతల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సాక్షి బృందం శుక్రవారం పట్టణంలో పలుచోట్ల విజిట్ చేయగా అనేక విషయాలు బట్టబయలు అయ్యాయి. వినియోగదారులను నిత్యం మోసం చేయడమే పనిగా వ్యాపారులు కొత్త కొత్త ఆలోచనలకు రూపకల్పనలు చేస్తున్నారు. పెట్రోలు బంకుల్లో చిప్‌లు వాడడం, కూరగాయల మార్కెట్లలో ఎలక్ట్రానిక్ కాటాల్లో మోసాలకు పాల్పడడం నిత్యం తంతుగా మారిపోయింది. ప్రశ్నించిన వినియోగదారులపై దాడులకు దిగడం, బెదిరించడం పరిపాటి. నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో అడుగడుగునా మోసాలమయం అయిపోయింది. తనిఖీలు నిర్వహించి పర్యవేక్షించి వినియోగదారులు నష్టపోకుండా చూడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మార్కెట్లో నెల మామూళ్లకు అలవాటుపడ్డ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చిన సమయంలో మినహా అధికారులు అటువైపుగా చూడడం లేదు. తూకాల్లో మోసపోకుండా ఉండేందుకు వినియోగదారుల కోసం ధర్మకాటాను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడ సిబ్బంది అందుబాటులో ఉండాలి. వేయింగ్ మెషన్ అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వేయింగ్ మెషన్‌ను కిందపడేశారు. ధరల పట్టికలో వ్యత్యాసాలున్నాయి. నిత్యం కూరగాయల ధరలను పట్టికపై మార్పులు చేయాల్సి ఉంది. మార్కెటింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో బోర్డుపై ఒక ధర, వ్యాపారులు విక్రయించేది మరో ధరగా ఉంది.



తూనికలు, కొలతల శాఖ కార్యాలయం

మోసాలు జరుగుతున్నాయి



వ్యాపారులు వినియోగదారులను నష్టపరుస్తున్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ప్రశ్నిస్తే చులకనగా మాట్లాడుతున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి వినియోగదారులు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలి

– రమణారెడ్డి, వినియోగదారుడు

ఆదమరిస్తే జేబులకు చిల్లే



మార్కెట్‌లో ఏదైనా వస్తువు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. ఆదమరిస్తే కవర్లు మార్చడం, తక్కువ తూకం వస్తువులు ఇస్తుంటారు. వినియోగదారుడు కూడా ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలి. –ఎస్‌కే సమీర్, బుజబుజనెల్లూరు



కూరగాయల మార్కెట్లో కిందపడవేసిన ధర్మకాటా

కుళ్లిన సరుకుల మిక్సింగ్..

కూరగాయల మార్కెట్‌లో కుళ్లిన, పాడైపోయిన కూరగాయలను వినియోగదారులకు అంటగడుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే వినియోగదారులను చులకనగా మాట్లాడడం పరిపాటి అయిపోయింది. కేజీకి 100 గ్రాముల నుంచి 150 గ్రాములు తూకం తక్కువ, నాణ్యత లేని కూరగాయలను వినియోగదారులకు అంటగడుతున్నారు. నెల్లూరు నగరంలో పదిలక్షల జనాభా ఉంది. నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో కూరగాయల మార్కెట్‌ను సందర్శిస్తారు. వారికి అవసరమైన కూరగాయలను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. కుళ్లినవి, వాడిపోయినవి తూకం తక్కువగా అంటగడుతున్నారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయ మార్కెట్‌లో వినియోగదారులు నష్టపోకుండా చూడాల్సిన అధికారులు ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



మార్కెట్‌లలో వస్తు విక్రయాల్లో తూకాల్లో తేడాలు వస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడం ద్వారా అవకతవకలను నివారించే అవకాశం ఉంటుంది. కానీ అధికారులు ఎక్కడా పర్యవేక్షణ చేస్తున్నట్లు కనిపించడం లేదు.

– ఎస్‌కే అంజాద్, నేలటూరు

తూకాల్లో తేడాలు వస్తున్నాయి



చేపల మార్కెట్‌లో రెండు కేజీలు చేపలు కొనుగోలు చేస్తే తూకంలో సరిగానే ఉంటుంది. మరో దాంట్లో తూకం వేస్తే తేడాలు వస్తున్నాయి. కొందరు విక్రయదారులు మోసాలకు పాల్పడుతున్నారు.

–బూదూరు జయరాజ్, కపాడిపాళెం

తోపుడు బండ్లపై మోసం



రోడ్లపై తోపుడు బండ్లలో కూడా కాటాలు పెట్టి వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు. సాక్షి విజిట్ సందర్భంగా వేదాయపాళేనికి చెందిన సుబ్బారావు అనే వినియోగదారుడు కేజీ దానిమ్మ కాయలు కొనుగోలు చేశాడు. సాక్షి కెమెరాను చూడడంతో ఆ వ్యాపారస్తుడు కేజీ రాయితో పాటు 400 గ్రాములు అదనంగా తూచి వినియోగదారుడికి ఇచ్చాడు. మొత్తం 1,400 గ్రాములు తూగాల్సి ఉంది. దానిమ్మ కాయలను మార్కెట్‌లో మరో వేయింగ్ మిషన్‌లో పరిశీలించగా 1,135 గ్రాములు వచ్చింది. కాటాల్లో టెక్నిక్‌లను ఉపయోగించి వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

ఏమార్చి కవర్లు మార్చేస్తున్నారు

కొన్ని పండ్ల దుకాణాల్లో పండ్లు కొనుగోలు చేస్తే నిర్వాహకుడు, పనిచేసే వ్యక్తి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాము కొన్న కవర్ను పక్కన పెట్టి ముందుగా ఏర్పాటు చేసుకున్న కవర్‌ను ఏమాత్రం అనుమానం రాకుండా వినియోగదారునికి ఇస్తున్నారు. ఓ వినియోగదారుడు నగరంలోని ఓ పండ్ల దుకాణంలో నాణ్యత కల్గిన రెండు కేజీల యాపిల్ పండ్లు, కేజీ ద్రాక్ష, ఒక కేజీ దానిమ్మలు కొనుగోలు చేశారు. కస్టమర్ కొనుగోలు చేసే క్రమంలో దుకాణదారుడు యాపిల్ పండ్ల కవర్‌ను మార్చేశారు. నాణ్యతలేని పండ్లను కవర్‌లో ముందుగా ఉంచి కస్టమర్‌ను బోల్తా కొట్టించారు. వినియోగదారుడు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.

నాణ్యత లేని వస్తువులు ఇస్తున్నారు



మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేస్తే వినియోగదారుడు నష్టపోతున్నాడు. వినియోగదారులకు అవసరమైనవి ఏరుకునే పరిస్థితి లేదు. వ్యాపారులు ఇచ్చినవే తీసుకోవాల్సి వస్తుంది. కుళ్లినవి, వాడిపోయినవి కలిపి వినియోగదారులకు అంటగడుతున్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి వినియోగదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. – వెంకటరెడ్డి, వినియోగదారుడు

నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదు



ప్రొవిజన్స్ దుకాణాలు, మార్ట్‌లలో పప్పుదినుసులు, నూనె, ఇతర నిత్యావసర వస్తువుల్లో నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదు. తక్కువ నాణ్యత కల్గిన వస్తువులను విక్రయాలు చేస్తున్నారు. అధికారులు ఆయా వస్తువులను పరిశీలిస్తే వారి అవకతవకలు బయటపడుతాయి.

– రంజిత్, కిసాన్‌నగర్

బియ్యం బ్యాగ్‌లో ఒకటిన్నర కిలోల తరుగు



హోల్‌సేల్ అంగడి నుంచి 25 కిలోల బియ్యం బ్యాగ్ కొనుగోలు చేశాం. వాటిని తెలిసిన వారి దగ్గర కాటా పెడితే ఒకటిన్నర కిలోలు తగ్గాయి. అంటే ఒక బస్తా మీద కనీసం రూ.80 నష్టపోయాం. బియ్యం తగ్గాయని వ్యాపారులను అడిగితే వారు తాము తయారు చేయలేదని పైనుంచి అన్ని బస్తాలు అలాగే వస్తున్నాయి. ఏమీ చేయలేమని బుకాయిస్తున్నారు. చేసేదేమి లేక మౌనంగా ఉండాల్సిన పరిస్థితి. ఇలా అన్ని రకాల నిత్యావసర సరుకుల్లో మోసం జరుగుతోంది. అధికారులు నిత్యం దాడులు చేస్తే ఇలాంటివి జరగవు. – రీహానా, బుజబుజనెల్లూరు

వినియోగదారులుకు అండగా ఉంటాం

తూనికలు, కొలతల శాఖ వినియోగదారులకు అండగా ఉంటుంది. మార్కెట్‌లో ఎవరైనా వ్యాపారులు మోసం చేసినట్టు తెలిస్తే వెంటనే తమకు సమాచారమివ్వాలి. తక్షణమే తాము వచ్చి అలాంటి వారిమీద కేసులు నమోదు చేస్తాం. జిల్లాలో ఇప్పటి వరకు 290 మందిపై కేసులు నమోదు చేశాం. తూకాల్లో మోసం చేసేవారిపై భారీగా అపరాద రుసుం వసూలు చేస్తాం.

– ఐజాక్, కంట్రోలర్, తూనికలు, కొలతలశాఖ

న్యూస్‌రీల్

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

- అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐఎంఏ హాల్‌లో అపస్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఆర్థిక విషయాల పట్ల ప్రభుత్వం శీతకన్ను వేసిందని, జీతాలు తప్ప ఏ ఆర్థిక ప్రయోజనాలు లేవన్నారు. ఆర్థిక బకాయిలు, సరెండర్ లీవ్స్, పీఎఫ్ లోన్స్, ఏపీజీఎల్ఐ లోన్లు వెంటనే విడుదల చేయాలన్నారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పీఆర్సీ వెంటనే ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు చక్రపాణి, పుట్టా శేషు, జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, నాయకులు మణికందరాచారి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై స్పిరిట్ ట్యాంకర్ బోల్తా



క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు తీస్తున్న దృశ్యం

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద స్పిరిట్‌లోడు లారీ ట్యాంకర్ అదుపుతప్పి శుక్రవారం బోల్తాపడింది. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు వెళుతూ గొలగమూడి క్రాస్ రోడ్డు సమీపానికి చేరుకోగానే డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ట్యాంకర్‌లోని స్పిరిట్ రోడ్డుపై పొర్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. క్రేన్ల సహాయంతో ట్యాంకర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బిలకూట క్షేత్రం అభివృద్ధికి కృషి

- దేవదాయశాఖ మంత్రి ఆనం



మాట్లాడుతున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం అభివృద్ధికి దేవదాయశాఖ నుంచి సంపూర్ణ సహకారం అందించనున్నట్లు రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రభుత్వం తరుపున మంత్రి శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కల్యాణ వేడుక పూర్తయిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ఆనం మాట్లాడుతూ బిలకూట క్షేత్రం అభివృద్ధికి ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కృషి చేస్తున్నారని, వారి కృషికి దేవదాయశాఖ తరపున సహకారం అందించి ఆలయ అభివృద్ధిని వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రూ.12.5 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులకు రంగం సిద్ధం చేశారని, టెండర్లు కూడా దాదాపుగా పూర్తయ్యాయని వివరించారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1.85 కోట్లతో ఆలయం చుట్టూ ప్రహరీ, టీటీడీ నిధులు రూ.2.65 కోట్లతో గాలిగోపురం నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కల్యాణ కట్ట, కళ్యాణ మండపం, అన్నదాన సత్రం పనులు కూడా ప్రారంభించనున్నట్లు వివరించారు.

కమనీయం.. శ్రీవారి కల్యాణ వైభోగం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



కమనీయంగా సాగుతున్న ప్రసన్నుని కల్యాణం

- వైకుంఠాన్ని తలపించిన బిలకూటక్షేత్రం
- గోవింద నామస్మరణలతో మారుమోగిన కొండబిట్రగుంట

బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూటక్షేత్రం బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన ప్రసన్నుడి కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల గోవింద నామస్మరణలు, వేదపండితుల దివ్యమంత్రోచ్ఛరణలు, శుభకర మేళతాళాల మధ్య స్వామివారి కల్యాణం వైకుంఠ వైభవాన్ని తలపించింది. పాతబిట్రగుంట, కొండబిట్రగుంట వీధుల్లో గజవాహనంపై పెండ్లి కుమారుడిగా విహరించిన స్వామి వారు ఉదయం శుభ ముహూర్తంలో కల్యాణవేదిక వద్దకు చేరుకున్నారు. పలు రాష్ట్రాల నుంచి తెప్పించిన పుష్పాలు, తులసీ మాలలతో శోభాయమానంగా అలంకరించిన కల్యాణ వేదికపై ఉభయ దేవేరులతో స్వామివారు అలంకార భూషితులయ్యే సమయానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకురాగా, కల్యాణోత్సవం ఉభయకర్తలు పట్టువస్త్రాలు, కల్యాణ ద్రవ్యాలు తీసుకువచ్చారు. వేదికపై స్వామివారు సర్వాలంకారణ భూషితులైన తర్వాత అర్చక బృందం వైఖానస ఆగమోక్తంగా కల్యాణ వేడుకను ప్రారంభించారు. తొలుత విశ్వక్సేనుని పూజతో ప్రారంభించి యజ్ఞోపవీత ధారణ, కంకణ ధారణ, వేదమంత్రోక్తంగా కల్యాణ ద్రవ్యాలను శుద్ధిచేసే పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. మధుపర్కం, దృశ్య, స్పర్శ, శ్రవణ వంటి షోడశోపచార పూజలను శాస్త్రోక్తంగా పూర్తి చేసి కల్యాణ ఘట్టాన్ని ప్రారంభించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు భక్తి పారవశ్యంతో గోవిందనామ స్మరణలు చేస్తుండగా, భాజాభజంత్రీలు ఉచ్ఛ స్థాయిలో మోగుతుండగా మాంగళ్యధారణ నేత్రపర్వంగా సాగింది. ఇదే సమయానికి మరో 10 జంటలకు పైగా స్వామివారి సన్నిధిలో ఒక్కటయ్యాయి.

రథోత్సవంలో సమస్యలు

ప్రసన్నుడి కళ్యాణోత్సవం అనంతరం స్వామివారి రథోత్సవంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆలయ అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణా లోపం కారణంగా రథం చక్రాలు పట్టేసి ముందుకు కదిలేందుకు మొరాయించడంతో ఆగమేఘాల మీద మరమ్మతులు చేపట్టారు. కల్యాణం తర్వాత శ్రీదేవి, భూదేవితో కలిసి కొండ దిగువన ఉన్న రథంపై స్వామివారు కొలువు దీరారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య రథం కదిలిన కొద్ది నిమిషాల్లోనే చక్రాలు పట్టేశాయి. రథం ముందుకు కదలకపోవడంతో హుటాహుటిన మరమ్మతులు చేయిస్తున్నారు. రాత్రి ఏడు గంటల వరకు కూడా మరమ్మతులు పూర్తి కాలేదు. దీంతో ట్రాక్టర్‌పై స్వామివారి ఊరేగింపు నిర్వహించాలని దేవదాయశాఖ అధికారులు, పాలకవర్గం చర్చలు జరుపుతోంది. బ్రహ్మోత్సవాల నిర్వహణలో దేవదాయశాఖ అధికారులు మొదటి నుంచి నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్సవాలకు సరైన ప్రచారం కల్పించకపోవడం, వీఐపీ పాస్‌లు, వెహికల్ పాస్‌ల్లో మితిమీరిన రాజకీయ జోక్యం కారణంగా భక్తులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈఓ కూడా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు సైతం వినిపించాయి. ఉభయకర్తలు, దాతలతోనూ ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. కనీసం రథోత్సవం ముందుగా ఏర్పాట్లు సరిచూసుకుని ఉంటే స్వామివారి రథోత్సవం మధ్యలో నిలిచిపోయేది కాదని భక్తులు మండి పడుతున్నారు.

17 నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

నెల్లూరు (టౌన్): స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాలలో ఈనెల 17 నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆర్ఐఓ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో ఎగ్జామినర్లుగా నియమించిన అధ్యాపకులందరిని సంబంధిత జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ రిలీవ్ చేసి స్పాట్ వాల్యుయేషన్‌కు పంపాలన్నారు. మొదటి స్పెల్‌లో ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్‌మాటిక్స్, సివిక్స్, 22 నుంచి రెండో స్పెల్‌లో ఫిజిక్స్, ఎకనామిక్స్, 24 నుంచి మూడో స్పెల్‌లో బాటని, జువాలజీ, కామర్స్ సబ్జెక్టులకు మూల్యాంకనం జరుగుతుంది.

'మద్యం' ముట్టని ఊరు

- 30 ఏళ్లుగా ప్రత్యేక కట్టుబాటును కొనసాగిస్తున్న గ్రామస్తులు
- నిబంధనలు అతిక్రమిస్తే రూ.10 వేల జరిమానా
- పెన్నా నుంచి ఇసుక బయట ప్రాంతాలకు తరలించకుండా ఆంక్షలు
- బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తే.. ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగింత
- 2021లో ఉత్తమ పంచాయతీగా పాతవెల్లంటి గ్రామం

ఆ ఊరులో మూడు దశాబ్దాలుగా సంపూర్ణ మద్య నిషేధం కొనసాగుతోంది. స్థానికులు ఈ ఊరులోనే కాదు.. బయట ప్రాంతాలకు వెళ్లినా మద్యం ముట్టరు. మద్యం తాగడం ఈ తరం యువతకు ఒక ఫ్యాషన్. నగరాలు, పట్టణాల నుంచి పల్లెల వరకు ఊర్లలో ఏ పండగొచ్చినా.. చావొచ్చినా.. ఎన్నికలొచ్చినా.. మందు బాటిల్ ఓపెన్ కావాల్సిందే. కానీ ఆ పల్లె అందుకు అమడ దూరంలో ఉంటుంది. ఆ ఊరు ఈ కట్టుబాటును విధించుకుంది. ఈ విషయంలో అక్కడి జనం రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తారు. ఎవరైనా మద్యం తాగితే జరిమానా కట్టాల్సిందే. ఇప్పటి వరకు ప్రతి ఒక్కరూ మద్యానికి దూరంగా ఉంటున్నారు.



పాత వెల్లంటి గ్రామం వ్యూ

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామం... మద్య పానానికి దూరం. నేటి కాలంలో కూడా ఇలాంటి ఆదర్శ గ్రామం ఉండడం అందరిని ఆశ్చర్య పరుస్తోంది. ఎప్పుడో ముప్పై ఏళ్ల క్రితం విధించుకున్న స్వీయకట్టుబాటును ఇప్పటికీ అమలు చేస్తోంది. ఈ విషయంలో అందరూ రాజకీయ పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తారు. 1994 నుంచి ఇప్పటి వరకు దాదాపు 30 ఏళ్లుగా గ్రామంలోకి మద్యం ప్రవేశించకుండా గ్రామ పెద్దలు కట్టుబాట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆ కట్టుబాటును ఇప్పటికీ ఆనవాయితీగా కొనసాగుతోంది. ప్రస్తుతం యువత కూడా పెద్దల కట్టుబాటును కొనసాగిస్తూ.. వారి అడుగుజాడల్లో నడుస్తున్నారు.

పాతవెల్లంటి గ్రామంలో మొత్తం 650 కుటుంబాలు ఉన్నాయి. 1200 ఓటర్లు ఉండగా, 3 వేల మంది వరకు జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో 1994 నుంచి సీపీఎంకు చెందిన అభ్యర్థులే సర్పంచులుగా గెలుస్తున్నారు. ప్రభుత్వాలు మారినా గ్రామ కట్టుబాటు మాత్రం మారకుండా పెద్దలు కాపాడుకుంటూ వస్తున్నారు. గ్రామంలోకి ఎవరైనా మద్యం బాటిల్లు తీసుకొచ్చినా, మద్యం సేవించినా వారికి రూ.10 వేలు జరిమానా విధిస్తారు. మద్యం సేవించాలంటే పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే.

బెల్టు షాపు పెడితే బెండు తీస్తారు

30 ఏళ్లుగా పాతవెల్లంటిలో వైన్ షాపు ఏర్పాటు చేసేందుకు ఏ పార్టీకి చెందిన పెద్దలు కూడా సాహసం చేయలేదు. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఒక్కొక్క గ్రామంలో దాదాపు 10 బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే పాత వెల్లంటిలో మాత్రం బెల్టు దుకాణం నిర్వహిస్తే బెండు తీస్తారు. బెల్టు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే గ్రామస్తులే పోలీసులకు అప్పగిస్తారు. కల్లు దుకాణాలు కూడా ఊరి బయట పెట్టుకోవాలని పెద్దలు నిర్ణయించారు.

ఇసుక తరలిస్తే రూ.10 వేలు జరిమానా

పాత వెల్లంటి గ్రామానికి సమీపంలో పెన్నా పరీవాహక ప్రాంతం ఉంది. ఇక్కడి ఇసుకను గ్రామస్తులు మాత్రమే వినియోగించుకునేలా నిర్ణయించుకున్నారు. బయటకు ప్రాంతాలకు ఇసుకను తరలిస్తే రూ.10 వేలు జరిమానా విధించేలా నిబంధనలు విధించారు. ఈ క్రమంలో గ్రామంలోని పెన్నా నుంచి ఇసుకను బయటకు తరలించేందుకు ఎవరూ ప్రయత్నం కూడా చేయరు. గ్రామంలోని కట్టుబాట్లను అతిక్రమించిన వారి నుంచి వసూళ్ల చేసిన జరిమానాలు గ్రామాభివృద్ధి, ఆలయాభివృద్ధికి ఖర్చు చేయడం గమనార్హం.

ఉత్తమ పంచాయతీగా ఎంపిక

పారిశుధ్య నిర్వహణ, గ్రామ సభల నిర్వహణలో కేంద్రం 2021 సంవత్సరానికి పాత వెల్లంటి ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గ్రామ సభ కేటగిరీ కింద ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి గ్రామానికి కేంద్రం రూ.10 లక్షలు నిధులు కేటాయించింది. ఆ నిధులతో గ్రామానికి సీసీరోడ్డును నిర్మించుకున్నారు.

అదృష్టంగా భావిస్తున్నా..



ఈ గ్రామంలో తాను కూడా ఉండడం అదృష్టంగా భావిస్తున్నాను. గ్రామస్తులు మద్యాన్ని గ్రామంలోకి రానివ్వకుండా నిబంధనలు పెట్టడం సంతోషంగా ఉంటుంది. పెద్దల కట్టుబాట్లను ఎవరూ అతిక్రమించకుండా కొనసాగిస్తున్నాం.

– వనం, సుబ్బమ్మ, గ్రామస్తురాలు

యువత కూడా బాధ్యతగా తీసుకుంది



గ్రామంలోకి మద్యం అనుమతి లేకుండా పెద్దలు తీసుకున్న నిర్ణయాన్ని గ్రామంలోని యువత కూడా బాధ్యతగా తీసుకుని నడుచుకుంటుంది. రానున్న రోజుల్లో కూడా తాము కట్టుబాట్లను ఏ మాత్రం చెదరకుండా కొనసాగిస్తాం.

– గుడి ఆనంద్, రైతు

కట్టుబాట్లను కొనసాగిస్తున్నాం



పెద్దలు పెట్టిన కట్టుబాట్లను మేము కూడా కొనసాగిస్తున్నాం. గ్రామ ప్రజలు కూడా కట్టుబాట్లకు అనుగుణంగా నడుచుకుంటున్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తుంటాం.

– పాదర్తి రాధ, పాతవెల్లంటి గ్రామ సర్పంచ్

గ్రామస్తులందరి సహకారంతోనే...



గ్రామంలో అన్ని కులాల వారు ఉన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్కరి సహకారంతోనే 30 ఏళ్లుగా కట్టుబాట్లను ఇప్పటికీ కొనసాగించ గలుగుతున్నాం. భవిష్యత్‌లో కూడా ఇలానే కొనసాగుతుందని ఆశిస్తున్నాను.

– పల్లవరపు చెంచయ్య, మాజీ సర్పంచ్

సమస్యలపై కూడా కలిసికట్టుగా పరిష్కారం



గ్రామంలో ఏ సమస్య వచ్చినా గ్రామస్తులందరు ఒకే తాటి మీదకు వచ్చి సమస్యను పరిష్కరించుకుంటాం. గ్రామస్తులందరం కలిసి కట్టుగా ఉండడంతోనే 30 ఏళ్లుగా అన్ని కట్టుబాట్లు కొనసాగుతున్నాయి.

– గంపల వెంకటరమణయ్య, గ్రామస్తుడు

క్లుప్తంగా

గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసిన వీఎస్‌యూ వీసీ



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు బొకే అందజేస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత

వెంకటాచలం: రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీఎస్‌యూ అభివృద్ధికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తిని కూడా మర్యాద పూర్వకంగా కలిశారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి నియామకం

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో జిల్లాకు చెందిన పలువురిని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మైనార్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్‌గా సయ్యద్ హంజాహుస్సేని, మైనార్టీ సెల్ సెక్రటరీలుగా షేక్ అలిఅహ్మద్, ఎస్‌కే షాహుల్‌హమీద్ నియమితులయ్యారు. మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీలుగా షేక్ మొయినుద్దీన్, షేక్ అహ్మద్, మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా సయ్యద్ అబ్దుల్ సలీం, రాష్ట్ర ఐటీ వింగ్ అధికార ప్రతినిధిగా పూసపాటి జగన్‌మోహన్‌రెడ్డి నియమితులయ్యారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి



ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. 1వ యూనిట్లో 250, 2వ యూనిట్లో 310, 3వ యూనిట్లో 410 మెగావాట్ల వంతున విద్యుదుత్పత్తి జరుగుతోందని వివరించారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ .75
సన్నవి : రూ. 50
పండ్లు : రూ. 30

రౌడీషీటర్ దారుణ హత్య



ఘటనా స్థలంలో మృతదేహం, చింటూ (ఫైల్)

నెల్లూరు (క్రైమ్): పాతకక్షలో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదు కానీ పక్కా ప్రణాళికతో ఓ రౌడీషీటర్‌ను కొందరు యువకులు దారుణంగా హత్య చేశారు. నెల్లూరు నగరంలో కలకలం రేకెత్తించిన ఈ ఘటన శుక్రవారం రాత్రి పొదలకూరు రోడ్డులోని ఇందిరా గాంధీనగర్ రెండో వీధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల సమాచారం మేరకు.. పాత వేదాయపాళెంకు చెందిన ఎ. సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ (24) పలు హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితుడుగా ఉన్నాడు. అతనిపై వేదాయపాళెం పోలీసుస్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. కొంతకాలంగా చింటూ కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డులో నివాసం ఉంటున్నారు. ఆయన శుక్రవారం రాత్రి పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ సమీపంలోని ఇందిరా గాంధీనగర్ రెండో వీధిలో ఉండగా గుర్తుతెలియని కొందరు యువకులు కత్తులతో దారుణంగా నరికి అక్కడి నుంచి పరారయ్యారు. తలతో పాటు శరీరంపై తీవ్రగాయాలై చింటూ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ ప్రాంతమంతా రక్తస్రావంతో నిండిపోయింది. సమాచారం అందుకున్న వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి తన సిబ్బందితో హుటాహుటినా ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ప్రాథమిక సమాచారం మేరకు ఓ వ్యక్తి ఫోన్ చేసి చింటూను అక్కడికి పిలిచినట్లు తెలిసింది. హత్య వెనుక అతని ప్రమేయం ఏమైనా ఉందా? గతంలో చింటూ చేతిలో హత్యకు గురైన వారి అనుచరుల పనా అనేది తెలియరావాల్సి ఉంది. సాంకేతికత ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలంతోపాటు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో నెల్లూరు నగరంలో రౌడీషీటర్ల ఆగడాలు శ్రుతి మించుతుడడంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది.

రెండిళ్లల్లో చోరీకి యత్నం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ డీఎస్పీ

కోవూరు: నెల రోజులుగా ఇళ్లకు తాళాలు వేసి ఉన్న రెండిళ్లలో గుర్తుతెలియని దుండగులు గురువారం రాత్రి చోరీకి యత్నించారు. ఈ ఘటన స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలో జరిగింది. బాధితులు, పోలీసుల సమాచారం మేరకు విశ్రాంత ఉపాధ్యాయుడు వరప్రసాద్, బ్రహ్మదేవి లక్ష్మి ఇళ్లు పక్క పక్కనే ఉంటాయి. వీరు నెల రోజుల క్రితం ఇళ్లకు తాళాలు వేసి విజయవాడ, హైదరాబాద్‌లో ఉంటున్న తమ కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు గురువారం అర్ధరాత్రి తర్వాత ఆ రెండిళ్ల తాళాలు పగులకొట్టి బెడ్రూమ్‌లోకి చొరబడి గాలించారు. బీరువాలు, అల్మరాలు ప్రతి చోట వెతికి అక్కడ ఉన్న వస్తువులను చిందరవందరగా పడేశారు. అయితే వరప్రసాద్ ఇంట్లో మాత్రం రూ.5 వేలు నగదు చోరీకి గురైంది. పెద్ద మొత్తంలో నగదు, నగలు దొరకకపోవడంతో దుండగులు ఇళ్లల్లో ప్రతి చోటా గాలించినట్లు అక్కడ పడేసిన వస్తువులను బట్టి తెలుస్తోంది. దుండగులు ఇద్దరుగా గుర్తించారు. వీరు స్కూటీలో వచ్చినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. వీరు వెళ్తూ ఆ ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న మోటార్ బైక్ హ్యాండిల్ లాక్ పగులగొట్టి అపహరించుకుని పోయారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ట్రెయినీ డీఎస్పీ శివప్రియ పరిశీలన చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. వేసవి కాలంలో ఆరుబయట, మిద్దెల మీద నిద్రపోయే వాళ్లు అప్రమత్తంగా ఉండాలని, బయట ఊర్లకు వెళ్లేవారు ముందుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ శివప్రియ తెలిపారు. ఆమె వెంట ఎస్‌ఐ రంగనాథ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

అందరూ నా వాళ్లే.. నన్నేమీ చేయలేరు

- పడుగుపాడు పంచాయతీ రికార్డులు తిరిగిచ్చేసిన వైనం
- డీపీఓ కార్యాలయం ఏఓ నా మనిషే
- కలెక్టరేట్‌లోనూ నా మనుషులే ఉన్నారు
- మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ పేరుతో ఫేక్ లేఖ పెట్టడం ఆషామాషీ కాదు
- సాక్షి కథనంతో అందరి ముందు రెచ్చిపోయిన అవినీతి విస్తరణ అధికారి

కోవూరు: కోవూరు మండల పరిషత్ కార్యాలయ అధికారి పంచాయతీ కార్యదర్శుల ముందు శుక్రవారం తన స్థాయి తెలుసుకోవాలంటూ మరోసారి రెచ్చిపోయాడు. శుక్రవారం సాక్షిలో 'అవినీతి విస్తరణ అధికారి' శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పడుగుపాడు పంచాయతీ రికార్డులను ఆగమేఘాల మీద తిరిగి ఇచ్చేసినట్లు సమాచారం. ఈ సమయంలో ఆయన అక్కడే ఉన్న పంచాయతీ కార్యదర్శులను ఉద్దేశిస్తూ కార్యాలయ ఉద్యోగుల ముందే నా స్థాయి ఏంటో తెలుసుకోవాలంటూ హెచ్చరించినట్లు తెలిసింది. 'డీపీఓ కార్యాలయం ఏఓ నా మనిషే. నేను ఏది చెబితే అదే చేస్తాడు. నేను చెప్పిందే వేదం. ఆయన డీపీఓనే శాసిస్తాడంటూ' మాట్లాడారు. 'ఏఓ ఏ పంచాయతీ చెబితే ఆ పంచాయతీకి డీపీఓ తనిఖీకి వెళ్లాలి' అంటూ డీపీఓ స్థాయి కూడా దిగజార్చుతూ మాట్లాడినట్లు కార్యదర్శులు చెబుతున్నారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా నా మనుషులే ఉన్నారు. ఒక మాజీ ఎమ్మెల్సీ జూపూడి పేరుతో ఫేక్ లెటర్ పెట్టడం అంటే ఆషామాషీ కాదు. అయినా నన్ను ఏమి చేయలేదంటే అది నా స్థాయి అంటూ రెచ్చిపోయాడు. 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న కొందరు పంచాయతీ కార్యదర్శులు కోవూరు మండలంలో తమకు పరిచయం ఉన్న కార్యదర్శులకు ఫోన్ చేసి మీ వాడి పాపం పండిందంటూ సంతోషం వెలిబుచ్చినట్లు తెలిసింది. గతంలో ఆయన డీపీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడు తమనూ ఇలాగే వేధించాడని సదరు కార్యదర్శులు వాపోయినట్లు సమాచారం. అసలు డీపీఓ కార్యాలయంలో ఏఓ దగ్గర నుంచి విచారణ చేస్తే వీళ్ల అవినీతి మొత్తం బయటకు వస్తుందని చెబుతున్నారు.

కానుకలు ఇప్పుకోండి

కోవూరు మండలంలోని సదరు అవినీతి విస్తరణ అధికారి లీలలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఆయన తీరుపై ఇటీవల కార్యదర్శులు డీపీఓ కార్యాలయ ఏఓ దృష్టికి తీసుకెళ్తే 'తనిఖీలు వద్దంటే ఆయన చెప్పినట్లు నడుచుకోండి. కానుకలు సమర్పించుకోండి' అని ఇటీవల పాటూరు కార్యదర్శికి చెప్పినట్లు తెలుస్తోంది. కానుకల్లో కచ్చితంగా పాటూరు పట్టుచీరలు ఉండాలని చెప్పడం విశేషం.

ప్రతి పంచాయతీకి రూ.15 వేలు

ఇటీవల పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన సర్వేకు సంబంధించి ప్రతి పంచాయతీకి రూ.15 వేల వంతున వసూలు చేసినట్లు కార్యదర్శులు కొందరు బయటపడ్డారు. ఆ సర్వేకు సంబంధించి మీకు అనుకూలంగా వ్యవహరిస్తానని కొందరు దగ్గర నుంచి ఫోన్‌పే ద్వారా డబ్బులు వేయించుకున్నట్లు ఆధారాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో పంచాయతీలకు ఆయన తనిఖీకి వచ్చిన సమయంలో తీసుకెళ్లిన డబ్బులు ఏ పద్దుల్లో, ఏ ఖర్చుల కింద రాయాలో అర్థం కాక కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. కొన్ని పంచాయతీల్లో ఎలాంటి తప్పులు జరగకపోయినా సరే రికార్డులు తనిఖీ చేయాలంటూ హెచ్చరిస్తున్నాడని వాపోతున్నాడు. పోతిరెడ్డిపాళెంలో తాను కట్టుకునే ఇంటికి ఇటుక బట్టీల యజమానులు ఇసుకలు ఇవ్వాలని హుకుం జారీ చేసినట్లు కొందరు చెబుతున్నారు. లేదంటే మీ ఇటుక బట్టీలకు పంచాయతీ అనుమతులు లేకుండా చేస్తానంటూ బెదిరించినట్లు ఇటుక బట్టీల యజమానులు వాపోతున్నారు. స్థానికంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడం చూస్తే అతని అవినీతిలో వీరికి భాగస్వామ్యం ఉందా? లేకపోతే అతనిపై చర్యలు తీసుకునేందుకు ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అని ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు.

అయ్యో కూలీలు.. ఆకలి కేకలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'ఉపాధి'కి గండి పడింది. కూలీలకు ఇప్పటికే రెండు నెలలుగా వేతనాలు జమకాకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారు. మార్చి ఆఖరి కావడంతో ఆలస్యమవుతుందంటూ అధికారులు బుకాయిస్తున్నారు. ఇప్పటికే కూటమి నేతలు బినామీ మస్తర్లతో అసలైన కూలీలకు పనులు కల్పించడంలేదు. గతంలో రోజుకు లక్షల మందికిపై పనిచేస్తే.. ఇప్పుడు ఆ కూలీల సంఖ్య సగానికి తగ్గిపోయింది.

- రెండు నెలలుగా వేతనాలు పడక అవస్థలు
- జిల్లా వ్యాప్తంగా రూ.22 కోట్లకు పైగా బకాయిలు
- గతంలో వారానికొకసారి జమ చేస్తున్న పరిస్థితి
- ఏప్రిల్ మొదటి వారంలో వస్తాయంటున్న అధికారులు
- పేమెంట్లు అందకపోవడంతో తగ్గుతున్న కూలీల సంఖ్య



సంగం మండలంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. జనవరి నెలలో సంక్రాంతి పండగ తర్వాత నుంచి వారి బ్యాంక్ ఖాతాల్లో చిల్లిగవ్వ కూడా జమ కాలేదు. దీంతో ఉపాధి పనులకు హాజరయ్యే వారి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది. జిల్లాలో 4 లక్షలకు పైగా జాబ్‌కార్డులు కలిగిన కూలీలున్నారు. 37 మండలాల పరిధిలో గత ప్రభుత్వంలో నిత్యం 1.20 లక్షల నుంచి 1.40 లక్షల మంది వరకు పనులకు హాజరవుతుండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయా పార్టీల నేతలు యంత్రాలు పెట్టి బినామీ మస్తర్లు వేసి పనులకు గండి కొట్టారు. దీంతో ప్రస్తుతం సుమారు 70 వేల నుంచి 80 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

గతంలో ఇలా..

గతంలో ఉపాధి కూలీలకు వారం వారం వారి బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు జమయ్యేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం సిబ్బందిపై వేధింపులు, టీడీపీకి అనుకూల వర్గాల వారికే పనులు కల్పించాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో లక్ష్యం నీరుగారుతోంది. కూలీలకు పేమెంట్లు అందకపోవడం ఒక పరిస్థితి అయితే, అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో పనులు జరగాలంటూ ఆదేశాలివ్వడంతో పనులు కుంటుపడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ పాలనలో కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ప్రస్తుతం అటువంటి వాతావరణం లేదు. టీడీపీకి అనుకూలంగా ఉన్న వారికే పనులు కల్పిస్తున్నారు. బడ్జెట్ ఆఖరి నెలకు, ఉపాధి కూలీల వేతనాలకు ఏం సంబంధం అనే ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. ఈ ఏడాదికి కేటాయించిన నిధులు ఏమయ్యాయో చెప్పడానికి సందేహిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో పేమెంట్లు అందుతాయని అధికారులు అంటున్నారు. అయితే నమ్మకం లేదని కూలీలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

మొదటి వారంలో పేమెంట్లు అందుతాయి

ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. మార్చి కావడం, బడ్జెట్ కేటాయింపుల వల్ల జాప్యం జరుగుతోంది. ఏప్రిల్ మొదటి వారంలో బ్యాంక్ అకౌంట్లలో పేమెంట్ జమయ్యే అవకాశముంది.

– గంగా భవాని, డ్వామా పీడీ